# లేక్ ఫ్రంట్ పార్క్‌లోకి నేటి నుంచి సందర్శకులకు అనుమతి

గత వారమే ప్రారంభమైన పార్కు

గణేశ్ నిమజ్జనాల నేపథ్యంలో నిలిపివేసిన అధికారులు..

సిటీబ్యూరో, సెప్టెంబర్ 30(నమస్తే తెలంగాణ): చరిత్రాత్మక జలాశయం హుస్సేన్‌సాగర్ తీరంలో హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ నిర్మించిన లేక్ ఫ్రంట్ పార్కు ఆదివారం నుంచి సందర్శకులకు అందుబాటులోకి రానున్నదని అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. దాదాపు రూ.26.65 కోట్ల వ్యయంతో సరికొత్త థీమ్‌లతో రూపుదిద్దుకున్న లేక్ ఫ్రంట్ పార్కును గత మంగళవారం మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ప్రారంభించారు. ఆ తర్వాత హుస్సేన్‌సాగర్ చుట్టూ గణేశ్ నిమజ్జనం నేపథ్యంలో పార్కులన్నీ మూసివేయడంతో సందర్శకులను అనుమతించలేదు. ప్రస్తుతం నిమజ్జనాలు ముగియడంతో ఆదివారం నుంచి కొత్తగా నిర్మించిన లేక్ ఫ్రంట్ పార్కులోకి సందర్శకులను అనుమతిస్తున్నామని హెచ్‌ఎండీఏ అధికారులు తెలిపారు. లేక్ ఫ్రంట్ పార్కు ఉదయం 5 నుంచి రాత్రి 11 గంటల వరకు అందుబాటులో ఉంటుందని, ఉదయం 5 నుంచి 9 గంటల వరకు వాకర్స్ టైమింగ్‌గా నిర్ణయించారు. నెలకు రూ.100 చొప్పున చెల్లించి మార్నింగ్ వాక్ చేసే సదుపాయాన్ని నగర వాసులు వినియోగించుకోవచ్చని అధికారులు తెలిపారు. అదేవిధంగా లేక్‌ఫ్రంట్ పార్కులో రూ.11వేలు చెల్లించి పుట్టినరోజు వేడుకలు, గెట్ టు గెదర్ ఫంక్షన్స్, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలు వంద మంది మించకుండా చేసుకునే వారికి హెచ్‌ఎండీఏ ఈ సదుపాయాన్ని కల్పిస్తుందని తెలిపారు. ఈ కరాచీ బేకరీ అవుట్ లెట్‌తోపాటు మరికొన్ని అవుట్ లెట్స్ సందర్శకుల కోసం ఉదయం 9 నుంచి రాత్రి 11 గంటల వరకు అందుబాటులో ఉంటాయని అధికారులు వెల్లడించారు.



నెక్లెస్ రోడ్డు మార్గంలో జలవిహార్ పక్కన కొత్తగా హెచ్‌ఎండీఏ నిర్మించిన లేక్ ఫ్రంట్ పార్క్

## నిత్యం వ్యాయామం, యోగా చేయాలి

మంత్రి చామకూర మల్లారెడ్డి




ఆరోగ్యమే మహాభాగ్యమని.. సంపూర్ణ ఆరోగ్యవంతులుగా జీవించడం కోసం వ్యాయామం, నడక, యోగా సాధనకు సమయాన్ని కేటాయించాలని మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. శనివారం 'వరల్డ్ హార్ట్ డే' సందర్భంగా మల్లారెడ్డి నారాయణ సూపర్ స్పెషాలిటీ వైద్యశాల ఆధ్వర్యంలో కూకట్‌పల్లి రంగధాముని చెరువు పక్కన అశోక వన్ మాల్ నుంచి సూరారం వరకు నిర్వహించిన '5కే రన్ వాకథాన్'ను మంత్రి మల్లారెడ్డి, వైద్యశాల చైర్మన్ చామకూర భద్రారెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గుండె వైద్య నిపుణులు సుధాకర్, ఆనంద్ అగర్వాల్ తదితరులు ఉన్నారు. ఈ 5కే రన్ వాక్‌థాన్‌లో మంత్రి మల్లారెడ్డి డీజే పాటలకు స్టెప్పులేస్తూ తనదైన శైలిలో డైలాగులు చెబుతూ యువతలో జోష్ నింపారు. **- కేపీహెచ్‌బీ కాలనీ, సెప్టెంబర్ 30**

## కేరళ, తెలంగాణ సంస్కృతి చాలా గొప్పది

కేరళ పురావస్తు, ఓడరేవుల శాఖ మంత్రి అహ్మద్ దేవర కోవిల్



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కేరళ మంత్రి అహ్మద్ దేవర కోవిల్, దీపికారెడ్డి, డాక్టర్ మామిడి హరికృష్ణ

రవీంద్రభారతి, సెప్టెంబర్ 30 : కేరళ, తెలంగాణ సంస్కృతిక సంప్రదాయాలు చాలా గొప్పవని, హైదరాబాద్ నగరాన్ని కుతాబీషాలు, గోల్కొండ నవాబులు పాలించిన గొప్ప చరిత్ర ఉన్న నగరం హైదరాబాద్ అని, నేడు హైదరాబాద్ నగరంలో 5 లక్షల మంది కేరళీయులు నివసిస్తూ తెలంగాణ, కేరళ సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షిస్తున్నారని కేరళ రాష్ట్ర పురావస్తు, ఓడరేవుల శాఖ మంత్రి అహ్మద్‌దేవర కోవిల్ అన్నారు. తెలంగాణ ప్రభుత్వం, భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో రవీంద్రభారతిలోని ప్రధాన కళావేదికపై మూడు రోజులపాటు నిర్వహించే కేరళ, తెలంగాణ హెరిటేజ్ ఫెస్టివల్-2023 ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కేరళ మంత్రి అహ్మద్ దేవర కోవిల్, తెలంగాణ సంగీత నాటక అకాడమీ చైర్మన్ దీపికారెడ్డి, టూరిజం శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజ రామయ్య, తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు డాక్టర్ మామిడి హరికృష్ణ విచ్చేసి జ్యోతిప్రజ్వలన చేసి కేరళ,తెలంగాణ సంప్రదాయ నృత్యాలైన ప్రేరిణి, కథాకళి నృత్యాలు, కేరళ, తెలంగాణ ఫెస్టివల్ -2023 పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం మంత్రి అహ్మద్ దేవర కోవిల్ మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం కేరళీయుల ఆత్మ గౌరవ భవనాల కోసం నగరంలో ఎకరం స్థలాన్ని కేటాయించడం అభినందనీయమన్నారు. సభకు ముందు కేరళ యువతీయువకులు ప్రదర్శించిన పలు శాస్త్రీయ నృత్యాలు, ఫొటో ఎగ్జిబిషన్ ప్రేక్షకులను మంత్రముగ్దులను చేసింది. ఈ కార్యక్రమంలో కేరళ ఫోక్కూరు చైర్మన్ ఉన్ని కృష్ణన్, కార్యక్రమ నిర్వాహకుడు బెంజిమెన్ తదితరులు పాల్గొన్నారు.

## అద్దె దుకాణాల వేలానికి దరఖాస్తుల ఆహ్వానం

మలక్‌పేట, సెప్టెంబర్ 30: దిల్‌సుఖ్‌నగర్‌లోని మారుతీమందిర్ ఆలయానికి సంబంధించిన కాంప్లెక్స్‌లో దుకాణాలను అద్దెకిచ్చేందుకు అక్టోబర్ 6వ తేదీన బహిరంగ వేలం నిర్వహించనున్నామని, ఆసక్తి గలవారు గడువులోగా దరఖాస్తు రుసుం రూ.వెయ్యి చెల్లించి పేర్లను నమోదు చేయించుకోవాలని ఆలయ కార్యనిర్వహణాధికారి వీఎన్‌వీ.సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. షాపు నం.5 నుంచి 18 వరకు గల దుకాణాలను మూడేండ్ల కాలపరిమితితో అద్దెకు ఇచ్చేందుకు ఈ నెల 6వ తేదీన ఉదయం బొగ్గులకుంట తిలక్‌రోడ్ అబిడ్స్‌లోని దేవాదాయ, ధర్మాధాయ శాఖ కార్యాలయంలో వేలం పాట నిర్వహించనున్నామని తెలిపారు. పూర్తి వివరాలకు దిల్‌సుఖ్‌నగర్‌లోని మారుతీ మందిర్ ఆలయంలోగానీ, 9030957781, 8341155549 నంబర్లలో సంప్రదించాలని పేర్కొన్నారు.

## ద్రాక్ష సాగులో మెళకువలు పాటించాలి

శామీర్‌పేట, సెప్టెంబర్ 30: ద్రాక్ష సాగులో మెళకువలు పాటిస్తే లాభాలు అర్జించవచ్చని రాజేంద్రనగర్ ద్రాక్ష పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ ప్రభావతి రైతులకు సూచించారు. శామీర్‌పేట మండలం కొల్తూర్ గ్రామానికి చెందిన చంద్రమోహన్ రెడ్డి ద్రాక్ష తోటలో శనివారం కొండా లక్ష్మణ్ ఉద్యానవన విశ్వవిద్యాలయం, రాజేంద్రనగర్ ద్రాక్ష పరిశోధన కేంద్రం ఆధ్వర్యంలో రైతులకు ద్రాక్ష సాగు యాజమాన్య పద్ధతులు, మెళకువలపై రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వివిధ దశల్లో అందించాల్సిన నీరు, ఎరువులపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఏ ఏ సమయంలో ఎంత నీరు పెట్టాలి, ఎరువు ఎంత మోతాదులో వాడాలనే విషయాలను వివరించారు. ఈ కార్యక్రమంలో పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ వెంకటలక్ష్మి, డాక్టర్ వెంకటరమేశ్, ఉద్యానవన శాఖ అధికారి రేణుక, ద్రాక్ష రైతులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న శాస్త్రవేత్తలు, రైతులు

## జక్లైర్-కృష్ణా స్టేషన్ల మధ్య కొత్త రైల్వే మార్గం

- నేడు జాతికి అంకితం చేయనున్న ప్రధాని
- కృష్ణా నుంచి కాచిగూడ వరకు సర్వీసు

సిటీబ్యూరో, సెప్టెంబర్ 30(నమస్తే తెలంగాణ) : దక్షిణ మధ్య రైల్వే జోన్ ఆధ్వర్యంలో జక్లైర్-కృష్ణా రైల్వే స్టేషన్ల మధ్య కొత్తగా నిర్మించిన రైల్వే మార్గాన్ని అక్టోబర్ 1వ తేదీన భారత ప్రధాని నరేంద్రమోదీ జాతికి అంకితం చేయనున్నారు. మహబూబ్‌నగర్‌లో జరిగే కార్యక్రమం ద్వారా ఈ రైల్వే మార్గాన్ని ప్రధాని ప్రారంభించనున్నట్లు శనివారం రైల్వే అధికారులు తెలిపారు. ఈ మేరకు కృష్ణా రైల్వే స్టేషన్ నుంచి కాచిగూడ వరకు (వీడియో కాన్ఫరెన్స్ ద్వారా) మొట్టమొదటి రైలు సర్వీస్‌ను జెండా ఊపి ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమంలో రహదారి, పెట్రోలియం, సహజ వాయువు-ఉన్నత విద్య వంటి ముఖ్యమైన రంగాల్లో రూ.13,400 కోట్ల కంటే ఎక్కువ విలువైన అనేక ఇతర అభివృద్ధి ప్రాజెక్టులను కూడా ప్రధాని జాతికి అంకితం చేయనున్నారు. ఈ రైల్వే మార్గం ద్వారా తెలంగాణలోని దక్షిణ ప్రాంత జిల్లాలను రాష్ట్ర రాజధాని, కర్ణాటకలోని రాయచూర్‌తో కలుపుతుంది. ఫలితంగా ఆయా ప్రాంతాలకు చెందిన ప్రజల ఆర్థికాభివృద్ధికి తోడ్పడుతుందన్నారు.

## ఉత్సాహభరితంగా నృత్యాభినయం

మాదాపూర్, సెప్టెంబర్ 30: మాదాపూర్‌లోని అన్నమాచార్య బావనా వాహినిలో కళాకారులు గానాలాపన, నృత్య ప్రదర్శనలతో సందర్శకులను విశేషంగా ఆకట్టుకున్నారు. పద్మశ్రీ, డాక్టర్ శోభరాజు ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కళాకారులు పలు నృత్య ప్రదర్శనలు చేశారు. ఇందులో భాగంగా ఇందిరా మయూరి డ్యాన్స్ అకాడమీ గురువు యుక్తారెడ్డి శిష్య బృందం మౌక్తిక, మాధురి, అనిత, నక్షత్ర, శాన్వి, ధాన్విి, రోషిత, భవిష్య, కృతిక, వేదాన్షి, ఐశ్వర్య, రితిక, రాహిత్య, గీతిక సంయుక్తంగా కలిసి నృత్యాభినయాన్ని ప్రదర్శించి అలరించారు. ఈ సందర్భంగా భాగంగా పద్మశ్రీ, డాక్టర్ శోభరాజు కళాకారులకు జ్ఞాపికలను అందజేసి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో అన్నమాచార్య బావనా వాహిని విద్యార్థులు, కళాకారులు తదితరులు ఉన్నారు.



నృత్య ప్రదర్శనలతో అలరించిన కళాకారులు

## దసరాకు పది ప్రత్యేక రైళ్లు

సిటీబ్యూరో, సెప్టెంబర్ 30(నమస్తే తెలంగాణ): దసరా పండుగ సందర్భంగా ప్రయాణికుల సౌకర్యం కోసం అక్టోబర్ 2వ తేదీ నుంచి పది ప్రత్యేక రైళ్లను పొడిగిస్తున్నట్లు శనివారం దక్షిణ మధ్య రైల్వే జోన్ అధికారులు వెల్లడించారు. సికింద్రాబాద్-దిబ్రుగర్, సికింద్రాబాద్-ఆగర్తలా, తిరుపతి-జల్నా, జల్నా-చాప్ర, హైదరాబాద్-గోరక్‌పూర్ స్టేషన్ల మధ్య ప్రత్యేక రైళ్లు పొడిగించినట్లు అధికారులు పేర్కొన్నారు.

## ప్రతి వార్డులో మాస్ క్లీనింగ్

ప్రారంభించనున్న సినీ నటి అమల, సినీ గేయ రచయిత సుద్దాల అశోక్ తేజ, కమిషనర్ రోనాల్డ్ రాస్

జూబ్లీహిల్స్, సెప్టెంబర్ 30 : దేశవ్యాప్తంగా స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో నగరంలో పెద్దఎత్తున మాస్ క్లీనింగ్ చేపడుతున్నారు. జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆదేశాల మేరకు నగర వ్యాప్తంగా అన్ని వార్డుల్లో మాస్ క్లీనింగ్ కార్యక్రమాన్ని చేపట్టి ప్రజల్లో అవగాహన కల్పించనున్నారు. కమిషనర్ రోనాల్డ్ రాస్, ప్రముఖ సినీ గేయ రచయిత సుద్దాల అశోక్ తేజ, ప్రముఖ తెలుగు సినీ నటి అమలతో కలిసి ఆదివారం ప్రసాద్ ఐమాక్స్ థియేటర్ వద్ద కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. అనంతరం ఉదయం 10 నుంచి 11 గంటల వరకు ప్రతి వార్డులో ఎంపిక చేసిన మూడు ప్రాంతాల్లో మాస్ క్లీనింగ్ నిర్వహించనున్నారు. దీంతోపాటు అంతర్జాతీయ వృద్ధుల దినం సందర్భంగా ముగ్గురు వృద్ధులను సన్మానించనున్నారు. దీంతోపాటు రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ఆదేశాల మేరకు 'చెక్ యువర్ ఓట్' అనే కార్యక్రమంలో భాగంగా పోస్టర్లు, స్టాండిస్, కరపత్రాలతో అవగాహన కల్పించనున్నారు. 'ఐ ఓట్ ఫర్ ష్యూర్'.. నేను కచ్చితంగా ఓటు వేస్తాను అన్న నినాదాన్ని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లి అవగాహన కల్పించనున్నారు.

## నేడు 14 నిమిషాల అద్భుతం స్వచ్ఛతా కార్యక్రమం

సిటీబ్యూరో, సెప్టెంబర్ 30 (నమస్తే తెలంగాణ) : వందేభారత్ రైళ్లలో ప్రయాణికుల సౌకర్యం కోసం రైల్వే మంత్రిత్వ శాఖ మరో నిర్ణయం తీసుకున్నది. స్వదేశీ పరిజ్ఞానంతో తయారు చేయడంతోపాటు అత్యాధునిక సౌకర్యాలు కల్పిస్తున్న 'వందేభారత్' రైళ్లలో అక్టోబరు 1వ తేదీ ఆదివారం '14 నిమిషాల అద్భుతం' పేరుతో స్వచ్ఛతా కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. స్వచ్ఛతా-హీ-సేవా ప్రచారంలో భాగంగా భారతీయ రైల్వేలోని టెర్మినల్ స్టేషన్లలో ప్రారంభించనున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. ఇందులో భాగంగా క్లీన్‌నెస్ డ్రైవ్‌లో భాగంగా చెన్నై-విజయవాడ, సికింద్రాబాద్-తిరుపతి వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్ల కోసం విజయవాడ, తిరుపతి రైల్వే స్టేషన్లలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.